.. శ్రీ పైడితల్లమ్మ' తొలేళ్ళు పండగతో పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ సిస్టం రద్దు : ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో ఈ నెల 13న విజయనగరం ఉత్సవాలు, 14, 15 తేదీల్లో శ్రీ పైడిమాంబ తొలేళ్ళు, సిరిమానోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సవాలు, పండగ భద్రత, బందోబస్తు విధుల్లో నిమగ్నం కానున్నందున అక్టోబరు 14న జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన "పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ సిస్టం" ను రద్దు చేసినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.కావున, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, ఫిర్యాదులు చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయంకు వచ్చి ఇబ్బంది పడవద్దని ప్రజలను కోరారు.

బాలికలకు భరోసానిద్దాం

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : బాలికలకు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా భరోసానివ్వాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక ఆర్ అండ్ బి జంక్షన్ నుంచి పోలీస్ బేరెక్స్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మానవహారాన్ని నిర్వహించి, బాలికల సంరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, బాలికలకు అన్ని విధాలా అండగా నిలుస్తామని చెప్పారు. వారికి మంచి భవిష్యత్తును కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా యంత్రాంగం తరపున వారికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆడపిల్లల భద్రత... అందరి బాధ్యత. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ, బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వారిపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రతీఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికలకు రక్షణ కల్పించడంతోపాటు వారికి చక్కని చదువు, ఆరోగ్యం అందించాలని, వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షురాలు హిమబిందు, ఐసిడిఎస్ పిడి బి.శాంతకుమారి, సిడిపిఓలు, డిసిపియు, ఒన్ స్టాప్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తగ్గింపు ధరలో నిత్యావసరాల విక్రయాలు

తప్పుడు ప్రచారం చేయొద్దు : ఎమ్మెల్యే అదితి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు తగ్గింపు ధరల్లో నిత్యావసర సరకుల విక్రయాన్ని, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్థానిక ఆర్అండ్బి రైతు బజార్‌లో శుక్రవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా పామాయిల్ ప్యాకెట్ ను(850 గ్రాములు) రూ.110 చొప్పున, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్‌ను(910 గ్రాములు) రూ.124 చొప్పున వినియోగదారులకు అందజేశారు. కిలో రూ.45 చొప్పున టమాట పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు అందుబాటులోనే ఉన్నాయని, దీనికోసం ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ధరలు విపరీతంగా పెరిగినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండి వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జేసీ ఎస్.సేతు మాధవన్, డిఎస్ఓ మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ డిఎం మీనాకుమారి, మార్కెటింగ్ ఏడి బి.రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి కోటలో రాజవంశీయులు ఆధ్వర్యంలో ఘనంగా ఆయుధ పూజ



విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం రాజా దర్బార్లో శుక్రవారం రాజ వంశీయులు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు, కూటమి ఎమ్మెల్యే ఆర్విఎస్ కేకే రంగారావు (బేబినాయన,) ప్రముఖ వ్యాపారవేత్త రామ్ నాయనా, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. 1757 బొబ్బిలి యుద్ధంలో వినియోగించిన అనేక ఆయుధాలు తుపాకులు, కత్తులు, విల్లంబులు, బల్లెలు, కుమార్ కృష్ణా రంగారావు వినియోగించిన రాజ సింహాసనం బంగారపు కుర్చీ, తదితర వస్తువులకు ఘనంగా పూజ నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలుపుతూ రైతులు వ్యాపార వర్గాలు ఉద్యోగులు తదితరులకు మంచి జరగాలని కోరారు. ఈ ఆయుధ పూజలో బొబ్బిలి నియోజకవర్గం టిడిపి నాయకులు రాజుల అభిమానులతోపాటు పార్వతీపురం నియోజక వర్గానికి చెందిన నాయకులు కూడా పాల్గొన్నారు. ఈ ఆయుధ పూజలో డి.ఎస్.పి శ్రీనివాసరావు, ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ పామోటి చిన్నమనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు, అన్నసమారాధన

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం మండలం గోపన్నవలస గ్రామంలో శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నాడు దుర్గాదేవి సన్నిధిలో ప్రత్యేక సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. కుంకుమ పూజా కార్యక్రమంలో సుమారు 300 మంది భక్తులు పాల్గొన్నారు.కుంకుమ పూజా కార్యక్రమంలో గోపన్నవలస గ్రామస్తులతో పాటు జి మర్రి వలస, బాడాం, భగీరథపురం తదితర గ్రామాలు భక్తులు పాల్గొన్నారు. అలాగే చాలా మంది భక్తులు దుర్గాదేవికి సాధారణ పూజలు కూడా ఉదయం నుండి నిర్వహించారు. కుంకుమ పూజా కార్యక్రమం అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించరు. ఈ అన్నసమారాధన కార్యక్రమంనకు సుమారు 1800 మంది వరకు భక్తులు హాజరు అయ్యి దుర్గా దేవి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కమిటీ కుర్రవాళ్ళు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి తీరని లోటు : మాజీ ఎంపి శంకరరావు

విశాలాంధ్ర-విజయనగరం: భారతీయ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటని మాజీ ఎంపి డాక్టర్ డి వి జి శంకరరావు పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక పరిశ్రమల కు అధిపతి లానే కాకుండా, ఉన్నతమైన వ్యక్తిత్వం, విలువలు, సామాజిక దృక్పథం ఉన్న వ్యక్తిగా రతన్ టాటా సమకాలీన ప్రపంచంలో చెరగని ముద్ర వేశారని తెలిపారు.. తమ లాభాల్లో 60 శాతానికి పైగా తిరిగి సమాజానికే ఖర్చు చెయ్యడం టాటా గ్రూపు సంస్థల గొప్ప తనంగా పేర్కొన్నారు.. కరోనా విపత్కర పరిస్థితుల్లో సైతం చిత్త శుద్ధి తో ఆ సంస్థల ఉద్యోగుల సంరక్షణ చేపట్టడం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యత కూడా తీసుకున్నారని తెలిపారు. ఉప్పు మొదలు ఉక్కు దాకా, కార్లు నుండి విమాన రంగం వరకు వందలాది వ్యాపారాల్లో విస్తృతిని ప్రపంచ వ్యాప్తంగా పెంచిన రతన్ టాటా ఎలాంటి అనైతిక కలాపాల మచ్చ పడకుండా వాణిజ్యాన్ని నిర్వహించడం గర్వించదగ్గ విషయని తెలిపారు. దేశం గర్వించదగ్గ ఆ మహా వ్యక్తి 'భారత రత్న' కు అన్ని విధాలా అర్హులని పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ తీర్మానించినట్టుగా, ఆయనకు ఆ గౌరవాన్ని ప్రభుత్వం కల్పించాలని కోరారు. ఆయన వ్యక్తిత్వం అందరికీ ఆదర్శమనీ,.ఆయన చూపిన విలువల్ని పారిశ్రామిక వేత్తలు అనుసరిస్తే, సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందనీ డాక్టర్ శంకరరావు తెలిపారు.

పండగ శోభ వచ్చేసిందోచ్...

ఎటు చూసినా జన ప్రవాహమే

పైడితల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధంచేస్తున్న అధికారులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ వచ్చేసింది గత రెండు రోజులుగా ప్రధాన రహదారులన్నీ పూర్తిగా జన ప్రవాహంతో కిటకిటలాడాయి. ఇక పైడితల్లి అమ్మ వారి పండగ ఉత్సవ ఏర్పాట్లు అధికారులు సిద్ధం చేస్తున్నారు. శ్రీ పైడితల్లమ్మ జాతరతో పాటు విజయనగరం ఉత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత జిల్లాలో నిర్వహిస్తున్న మొట్టమొదటి ఉత్సవం కావడంతో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారయంత్రాంగం సమష్టిగా ముందుకేగుతున్నారు. స్థానిక సంప్రదాయం ఉట్టిపడేలా, సంస్కృతి వెల్లివిరిసేలా, విజయనగరం వైభవాన్ని చాటి చెప్పేలా విజ్ఞాన, వినోద కార్యక్రమాలతో సన్నద్ధం అవుతోంది. ఇప్పటికే శుక్రవారం పెద్ద చెరువు రోడ్డు వద్ద అఖిలభారత డ్వాక్రా బజార్ ను మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తో పాటు ఎమ్మెల్యే అతిధి గజపతిరాజు, అశోక్ గజపతిరాజు చేతులమీదుగా ప్రారంభించారు. ఇక ఉత్సవాలకు సంబంధించి 12 వేదికల వద్ద నిర్వహించడానికి సిద్ధం చేయగా ప్రతి వేదిక వద్ద అధికారుల కమిటీతో పాటు శాశ్వత సభ్యులను ఇంచార్జులుగా వేయడం జరిగింది. ఈ ఏడాది ఉత్సవాలు ప్రతి ఒక్కరి మదిలో మధుర స్మృతిని మిగల్చాలని మంత్రి కొండపల్లి ఇప్పటికే అధికారులకు సూచించారు. 14న తొలేళ్ళు, 15న సిరిమాను కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహించే ఉత్సవ శోభ నగరం నలుమూలలా అలరించేలా స్వాగత ద్వారాలను, ప్రభుత్వ భవనాలపై, పార్కో, ప్రధాన కూడళ్ళ వద్ద మిరిమిట్లు గొలిపే విద్యుత్తు కాంతులను ఏర్పాట్లను చేసారు. గతం కంటే భిన్నంగా, వైవిధ్యంగా, ప్రత్యేకంగా ఈ ఏడాది కార్యక్రమాల రూపకల్పన చేసినట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. కోట వెనుక భాగంలో శ్రీపైడిమాంబ చరిత్రను, విజయనగర వైభవాన్ని లేజర్ షోలుగా ప్రదర్శించడం ఈ ఏడాదికే ప్రత్యేకం . రంజని - శివరంజని థియేటర్లకి ఎదురుగా కోటపై 13, 14 తేదీలలో సాయంత్రం 6 నుండి 9 గంటల వరకు లేజర్ ఉంటుంది. అంతే కాకుండా ప్రతి ఏడాది అయోధ్యా మైదానంలో మెగా ఈవెంట్ ఒక్క రోజే జరిగేది. ఈ ఏడాది 13,14 తేదీలలో రెండు రోజులు మెగా ఈవెంట్లను నిర్వహించడం విశేషంగా చెప్పవచ్చు. 13న హైపర్ ఆది బృందంచే జబర్దస్త్ స్కిట్స్తో పాటు కలకత్తా డాన్సర్లచే బాద్ సల్సా ప్రదర్శన, ఇండియన్ ఐడల్ ఫేం సాయి ఆర్కెస్ట్రాతో వినోదాన్ని అందించడానికి సిద్ధం చేసారు. 14 న ప్రముఖ గాయకులు కార్తీక్చే మెగా మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నారు. అయోధ్య మైదానం లో హాట్ ఎయిర్ బలూన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయడమైనది. అయితే ఈ సంవత్సరం దసరా, అమ్మవారి పండగ ఇంచుమించుగా ఒకేసారి రావడంతో ప్రజలకు కొంతమేర గందరగోళ పరిస్థితి ఏర్పడింది.ఇప్పటికే విపరీతమైన ధరలు పెరిగి నానా అవస్థలు పడుతున్న ప్రజలకు వరుస పండుగలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఏది ఏమైనాప్పటికీ గత రెండు రోజులుగా విజయనగరం పరిసర ప్రాంతమంతా భారీ జనసంచారంతో రాత్రిపూట ప్రధాన ప్రాంతాల్లో విద్యుత్ కాంతులతో పూర్తిస్థాయి పండుగ వాతావరణం కనబడుతుంది.

'శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బిపి, షుగర్ పరీక్షలు

విశాలాంధ్ర- విజయనగరం ఫోర్ట్ : శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నెల వారీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్థానిక అయ్యన్నపేట చెరువు ప్రక్కనున్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో క్వీన్స్ ఎన్.ఆర్.ఐ. హాస్పిటల్ వారి సౌజన్యంతో బి.పి.షుగర్ పరీక్షలను డిస్ట్రిక్ట్ -102 డిప్యూటీ గవర్నర్ త్యాడ రామకృష్ణారావు (బాలు) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు, క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు మాష్టారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతీ ఒక్కరు తరుచుగా బి.పి, షుగర్ పరీక్షలను చేసుకోవాలని, ప్రతీరోజు ప్రజలంతా క్రమంతప్పకుండా నడవాలని సూచించారు. క్వీన్స్ ఎన్.ఆర్. ఐపిఆర్ఓ సి.హెచ్. మోహనరావు, టెక్నీషియన్లు కుమారి లిఖిత,ప్రసాద్ సేవలందించిన ఈ శిబిరంలో క్లబ్ గౌరవ సలహాదారులు, ఎలక్ట్ గవర్నర్ ఆరికతోట తిరుపతిరావు,శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ,కోశాధికారి ఆర్.సి.హెచ్. అప్పలనాయుడు, క్లబ్ పెద్దలు కోట్ల సత్యనారాయణ, కర్రోతు ఈశ్వర ప్రసాద్ (బుజ్జి), కర్రోతు శేఖర్, పత్రి సాయి, తదితర సభ్యులు భారీగా పాల్గొన్నారు.

కుచిపూడిలో రాణిస్తున్న చిన్నారి మౌక్తిక

తాజాగా దుబాయ్ షార్జాలో నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర-గుర్ల: ఏడేళ్ల వయసులోనే సంప్రదాయ కూచిపూడి నృత్యంలో రాణిస్తూ తాజాగా దుబాయ్ షార్జాలో తన నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకొని అలరిస్తుంది, పిట్ట కొంచెం కూత ఘనం అనే సామెత ఆ చిన్నారికి వర్తిస్తుంది.గతంలో మలేషియాలో కూడా తన నృత్య ప్రదర్శనతో అక్కడ తెలుగువారిని ఆకట్టుకుంది, అలాగే తాజాగా దుబాయ్ లో జరిగిన నృత్యంతో అక్కడ తెలుగువారి ప్రశంసలు అందుకుంది, ఆ అమ్మాయి స్థానికంగా కూడా పలు ప్రదర్శనలు చేసింది. ఇదీ విశాఖపట్నం నగరానికి చెందిన చిన్నారి మౌక్తిక ఘనత. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం నగరానికి చెందిన బి యోగి, సౌజన్య కుమార్తె చిన్నారి మౌక్తిక సంప్రదాయ నృత్యంలో రాణిస్తోంది. విశాఖ వ్యాలీ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న మౌక్తిక సంప్రదాయ నృత్యంలో ఇప్పటికే పలు ప్రదర్శనలు ఇచ్చింది. తాజాగా దుబాయ్ షార్జాలో నాట్యఘురి అనే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో దేశం తరుపున చిన్నారి పాల్గొంది,అక్కడ తన నృత్య ప్రదర్శన తో అందరినీ ఆకట్టుకుంది,చిన్నారి ప్రదర్శనకు నిర్వాహకులుతో సహా అందరూ ప్రశంసలు కురిపించారు, భవిష్యత్తులో సాంప్రదాయ నృత్యంలో మరింత రాణించాలని పలువురు ఆకాంక్షించారు.

దేశ భవిష్యత్ బాలికలదే....

ఆడబిడ్డను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదే - రోటరీ జిల్లా చైర్మన్ జె సి రాజు పిలుపు

విశాలాంధ్ర-బొబ్బిలి : దేశ భవిష్యత్ బాలికలదేనని, బాలికలు భావి భారత దీపికలని ప్రతి ఆడబిడ్డను కాపాడు కోవటం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యతని రోటరీ జిల్లా అధ్యక్షులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ బాలిక దినోత్సవ నేపధ్యంలోబొబ్బిలి రోటరీ క్లబ్ కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆడబిడ్డను కాపాడుకుందాం అనే నినాదంతో ర్యాలీ మరియు తాండ్ర పాపారాయ కూడలిలో బ్యానర్ ను ప్రదర్శిస్తూ అవగాహనకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడబిడ్డను పుట్టనిద్దాం, బ్రతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జె సి రాజు మాట్లాడుతూ ఆడపిల్లల హక్కులు, నిత్యజీవితంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు,సమస్యలు గురించి చర్చించి తగు చర్యలు తీసుకొనుటకు గాను ఐక్య రాజ్య సమితి ప్రతి సంవత్సరం అక్టోబర్ 11 న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నదని అన్నారు. భవిష్యత్ వైపు బాలికల చూపు అనే నినాదం తో ఈ ఏడాది బాలికాదినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బాలికలకు సాధికారత తో పాటు సమానత్వ సాధనకు ఈ నినాదం ప్రోత్సహిస్తున్నదని అన్నారు. బాలికల సాధికారత కొరకు వారి ఆరోగ్యం, పోషకాహారం,చదువు, హింసనుండి ,లైంగిక దోపిడినుండి రక్షణ, భద్రత, స్వేచ్ఛ వీటిపై ప్రభుత్వాలు, సమాజం, సంస్థలు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలను ఏ దశలోనూ ప్రోత్సహించకూడదన్నారుబాలికల విద్యకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. బాలికల హక్కుల పరిరక్షణ కుటుంబంనుండే ప్రారంభ కావాలన్నారు. చదువుకొనే స్వేచ్ఛ, నాణ్యమైన విద్య ,నైపుణ్యాలు బాలికలకు అందుబాటులో ఉన్నప్పుడే బాలికల భవిష్యత్ అభివృద్ధి పథంలో చూడగలమని అన్నారు.కార్యక్రమంలో రోటరీ సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ గౌ%శీ%బలి శ్రీనివాసరావు. కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కె రామ కృష్ణ, కృష్ణ మోహన్,శివ కాంత్, హమీద్, ఎం ప్రసాద్, కె నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం ఉత్సవ్‌కై అంతర్యామి నాటిక

విశాలాంధ్ర-బొబ్బిలి : ఈనెల 13 , 14 తేదీల్లో విజయనగరం పైడి తల్లి అమ్మవారి ఉత్సవాల సందర్భంగా విజయనగరం ఉత్సవ్ లో భాగంగా ఏకపాత్ర అభినయ ములు,సాంఘిక మరియు పౌరాణిక నాటికల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు.అందులో పౌరాణిక విభాగంలో..బొబ్బిలికి చెందిన ఆనందోబ్రహ్మ అకాడమీ వారిఅంతర్యామి పౌరాణిక ఘట్టం ఎంపికయింది. ఈ మేరకు ఈనెల 14వ తేదీ సాయంత్రం విజయనగరంలోని గురజాడ కళాభారతి లో అంతర్యామి ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఆహ్వానం అందినట్లు దర్శకుడు ఎం. విజయ మోహన్ రావు తెలిపారు. విజయనగరం ఉత్సవాలకు "అంతర్యామి ఎంపిక పట్ల శ్రీ కళా భారతి, ఆనందోబ్రహ్మ , రచన సమాఖ్య, యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ , బొబ్బిలి ఫిలిం సొసైటీ , గాంధీ స్మారక నిధి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కల్వర్టు మరమ్మతులు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి కి గ్రామస్తులు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణ పరిధి కోరాడ వీధి లోనీ స్థానిక మసీద్ దగ్గర కల్వర్టు పాడవడంతో ఆ వీధి వారు, చిన్నపిల్లలు, వాహనదారులు గత చాలా రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు రేవళ్ళ కిరణ్ కుమార్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లి మరమ్మత్తులు చేయమని కోరారు. ఆయన వినతికి సానుకూలంగా స్పందించి మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సంబంధిత సిబ్బందికి ఆదేశాలిచ్చి శుక్రవారం కల్వర్టు మరమ్మత్తు పనులు ప్రారంభించేలా చేశారు. ఈ కల్వర్టు మరమ్మతులు చేయడం ఎంతో సంతోషంగా ఉందనీ.. కమిషనర్ లాలం రామలక్ష్మి కు కోరాడ వీధి వాసులు అభినందనలు తెలిపారు.

అఖిలభారత డ్వాక్రా బజార్ ప్రారంభం

గ్రామీణ పేదరికాన్ని తగ్గించడానికి దోహదం : మంత్రి కొండపల్లి

నైపుణ్యాన్ని వెలికితీసే అవకాశం : కేంద్ర మాజీమంత్రి అశోక్

విశాలాంధ్ర-విజయనగరం: అఖిలభారత డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన (సరస్) ప్రారంభమయ్యింది. శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం, విజయనగర ఉత్సవాలను పురస్కరించుకొని, స్థానిక పెద్దచెరువు రోడ్డులోని మాన్సాస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను కేంద్ర మాజీ మంత్రి, మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో మొత్తం 254 స్టాల్స్ ఏర్పాటు చేసి, మన , రాష్ట్రంతోపాటు 18 రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, తినుబండారాలు, దుస్తులు, వస్త్రాలు, వివిధ రకాల కలంకారీ వస్తువులు, ఆయుర్వేద ఉత్పత్తులు, గృహోపకరణాలు, మహిళాసంఘాలు సృజనాత్మకతతో సృష్టించిన కళాకృతులను విక్రయానికి ఉంచారు. ఈ ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం అశోక్‌గజపతిరాజు మీడియాతో మాట్లాడుతూ మహిళల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు సైతం గౌరవప్రదంగా తమ జీవనాన్ని సాగించేందుకు, వారి ఆర్థికాభివృద్ధికి ఉప ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళలు తయారు చేసే కళాకృతులు, వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శనకు ఇలాంటి ప్రదర్శనలు వేదికగా నిలుస్తున్నాయని, దీనిని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మైసూరు ఉత్సవాల తరహాలో శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాన్ని నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రతీఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతంలో పేదరికాన్ని తగ్గించేందుకు, మహిళల ఆర్థికాభివృద్ధికి డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శనలు దోహదం చేస్తాయని అన్నారు. ఇలాంటి ప్రదర్శనను శాశ్వతంగా నిర్వహించేందుకు అమరావతిలో పది ఎకరాలను కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. జిల్లాలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు సహకరించిన వివిధ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. పదిరోజులపాటు నిర్వహించే ప్రదర్శనను ప్రతీఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ పరంగా తొలిసారిగా నిర్వహిస్తున్న విజయనగరం ఉత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, పైడితల్లి అమ్మవారి పండుగను, విజయనగరం ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. వివిధ వర్గాలతో చర్చించి, వారి అభిప్రాయాలను తెలుసుకొని ముందుకు వెళ్తున్నామన్నారు. అందరూ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఎంఎల్ఏ పూసపాటి అదితీ విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా మొట్టమొదటిసారిగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళల అద్భుత చేతి నైపుణ్యంతో రూపొందించిన ఎన్నో వస్తువులు, కళాకృతులు, వస్త్రాలను ఈ డ్వాక్రా ప్రదర్శనలో ఉంచారని, వీటిని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, సెర్ప్ సిఈఓ వీర పాండ్యన్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, నాబార్డ్ సిజిఎం కెవిఎస్ ప్రసాద్, డిఆర్‌డిఏ పిడి ఎ.కళ్యాణచక్రవర్తి, జెడ్‌పి సిఈఓ బివి సత్యనారాయణ, సిపిఓ పి.మురళి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, నాబార్డ్ డిడి నాగార్జున, వివిధ శాఖల అధికారులు, డిఆర్‌డిఏ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాలవలస యశస్విని, కొండపల్లి కొండలరావు, ఐవిపి రాజు, బొద్దుల నర్సింగరావు, అవనాపు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు హెల్పింగ్ హాండ్స్ వితరణ

విశాలాంధ్ర -జామి: మండలం లోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రతినెల ఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు వివిధ రకాల సేవలను అందజేస్తుంది. అందులో భాగంగా వారికి అవసరమైన నిత్యవసర వస్తువులను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో దసరా పండుగ ముందుగా నిత్యవసర వస్తువులు అందజేయాలని భావించి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొవ్వాడ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధ్యక్షులు కొవ్వాడ సన్యాసినాయుడు, ప్రధాన కార్యదర్శి మిడతాన తాతం నాయుడు చేతుల మీదుగా పేదలకు వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ పురోహితులు స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

వంగర గ్రామ మాజీ సర్పంచ్ మృతి

విశాలాంధ్ర-వంగర : మండలంలో మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ సభ్యులు బొత్స వాసుదేవరావు నాయుడు, సోదరుడు (అన్నయ్య)వంగర గ్రామ మాజీ సర్పంచ్ బొత్స రామారావు నాయుడు మరణించారు. గత అర్ధ రాత్రి 11 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు.శుక్రవారం నాడు అయన అంత్యక్రియలు జరిపించారు.ఆయన వంగర గ్రామ సర్పంచ్ గా పలు మార్లు చేశారు.అయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని పలువురు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-బాడంగి: మండలం వీర సాగరం సమీపమున బొబ్బిలి కి చెందిన చప్ప రామారావు పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్సై తార కేశవరావు తెలిపారు. శుక్రవారం రాత్రి పురుగుల మందు త్రాగి అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను బాడంగి ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఆయన చెప్పారు. వ్యసనాలకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతు. వీర సాగరం అత్తవారింటికి వచ్చి పురుగుల మందు తాగినట్లు తెలుస్తుంది. .. మనస్థాపానికి గురై పురుగుల మందు తాగినట్లు తెలుస్తుంది. మృతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు

రోడ్లు పూడ్చి వేత

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో వర్షాలకు పబ్లిక్ రోడ్లు పూర్తిగా పాడైనవి. గరివిడి నుండి మెరకముడిదాం వెళ్లే రహదారులు ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది అని సొంత నిధులతో మెరకముడిదాం నుండి గర్భం వరకు దగ్గరుండి మాజీ సర్పంచ్ బాలి బంగారు నాయుడు పూడ్చివేత పనులు చేపట్టారు. ఈ రహదారి గుండా వెళ్లే వాహన చోదుకులు హర్షం వ్యక్తం చేసారు.అధికారులు, పాలకులు ఇప్పటికైనా చొరవ తీసుకొని పూర్తిగా పూడ్చివేతలు చేపడతారని మండల ప్రజలు కోరుతున్నారు.

లోకమాతకు నృత్యాభిషేకం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: శరన్నరాత్రుల సందర్భంగా దుర్గమ్మ కొలువైయున్న బీసీ కాలనీ ప్రాంగ ణంలో & లెంక సూర్యనా రాయణ, నరసాయమ్మ నిర్వాహణలో ఆ లోకమాతకు సూర్య అకాడమీ విద్యార్థులచే నృత్య ప్రదర్శన నిర్వహించారు. సూర్య అకాడెమీ ఫౌండర్ టివి రామ్ కాశ్యప్ గారి ఆధ్వర్యంలో ఐశ్వర్య జ్యోతి బృందంచే నృత్య ప్రదర్శనలో భాగంగా దేవీశ్రీ,, సంజన, అక్షిత, వర్షిత, శ్రీవల్లి, సునంద, భూమి, ఆద్యా, లాస్యశ్రీ, సంజన, నేహశ్రీ, అక్షర, రుహ్విక, మీనా లాస్య, కుష్విక, సునంద, మనస్వీ పాల్గొని ఆ లోకమాత కరుణా కటాక్షాలకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు లెంక సూర్యనారాయణ, నరసాయమ్మ వారి చేతుల మీదుగా కళాకారులందరికీ ప్రశంసలతో షీల్డ్ అందజేసి, ఉపాధ్యాయులకు సన్మాన సత్కారాలు అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలు ఇంకెన్నో చేయాలని వారిని ఆశీర్వదించారు. ఈ నృత్యాభిషేకం కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. వారి కరతాళ ధ్వనులతో ప్రశంసలతో కళాకారులను అభినందించి, హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు టి.వి.రామ్ కాశ్యప్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇంత అద్భుతంగా జరగడానికి సహకరించిన బీసీ కాలనీ సభ్యులు మరియు సిబ్బందికి, ముఖ్యంగా పిల్లల్ని ఇంతగా ప్రోత్సహించిన తల్లిదండ్రులకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు. ఇటువంటి అవకాశాలు ఇంకెన్నో రావాలని ఆశిస్తున్నామని తెలిపారు.

ఉద్యమంలా పుస్తక పఠనం

విశాలాంధ్ర- చీపురుపల్లి : చీపురుపల్లి ఆశయా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సంచార గ్రంథాలయం ద్వారా పుస్తక పఠనం ఉద్యమంలో కొనసాగుతుందని ప్రముఖ సాహితీవేత్త బి గౌరీనాయుడు అన్నారు. రాజాం మండలం బద్దం గ్రామానికి చెందిన గౌరు నాయుడు ఇటీవల రచించిన అక్షర యజ్ఞం అనే పుస్తకాన్ని స్థానిక ఆశయ స్వచ్ఛంద సంస్థ లైబ్రరీకి శుక్రవారం నాడు అందజేశారు.. అంతేకాకుండా అదనంగా మరో రెండు వందల పుస్తకాలను కూడా ఆసియా సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి పుస్తకం ఉపయోగపడాలనే హాస్యంతో రచనలు జరుపుతున్నానన్నారు. ఆ దిశగా కృషిజరుపుతున్న ఆసియా సంచార గ్రంథాలయమునకు పుస్తకాల అందజేయడం ఆనందదాయంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశయ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ గౌరు నాయుడు మాస్టారు వంటి సాహితీవేత్తలు రచించిన పుస్తకాలు నేటి యువతకు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. గ్రామాల్లో ట్యూషన్ సెంటర్ ద్వారా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందియమన్నారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనంపై ఆసక్తిని కనబరుస్తూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. గౌర్నాయుడు మాస్టర్ అందజేసిన సుమారు 200 పుస్తకాలు సంచార లైబ్రరీ ద్వారా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా రెడ్డి రమణ వివరించారు.

బీమా డబ్బులు అందజేత : మాజీ ఎంపీపీ కంది

విశాలాంధ్ర-డెంకాడ: నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ మండలం నాతవలస గ్రామంలో ఇటీవలే గత ఏడాది డిసెంబర్ 24న గేదల ప్రవీణ్ కుమార్ ప్రమాదవశాత్తు మరణించడంతో ఈయనకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేసుకోవడంతో ఆయన తండ్రి గేదల అచ్చెన్న కి, భార్య గేదల గంగా కి శుక్రవారం 2,00,000 (రెండు లక్షల రూపాయలు) భీమా అందజేసిన నెల్లిమర్ల నియోజకవర్గం తెదేపా సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు , డెంకాడ మండలం మాజీ జడ్పిటిసి పతివాడ అప్పలనారాయణ డెంకాడ మండలం పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణీరాజు అవాల సోమశేఖర్ బమ్మిడి రమేష్ఈ కార్యక్రమంలో కంది చంద్రశేఖర రావు మాట్లాడుతూ సభ్యత్వం నమోదును తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో నమోదు చేసుకోవాలని కోరారు. ఇక నుంచి సభ్యత్వం నమోదు చేసుకునేవారు ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు 5,00,000 (ఐదు లక్షల) భీమా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

భవాని దీక్ష దారుల అన్నసమారాధన



విశాలాంధ్ర-దత్తిరాజేరు : ఇంగిలాపల్లి గ్రామంలో నవరాత్రులు దీక్షలో భాగంగా 27 మంది భవాని దీక్షా దారుల ఆధ్వర్యంలో శుక్రవారం సుమా రు 1500 మంది భక్తులుకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాధాలు స్వీకరించారు.

సామాజిక భవనమా... సిమెంట్ గోడౌనా?

అంబేద్కర్ భవనంపై అధికారుల నిర్లక్ష్యం
పట్టించుకోని పాలకులు ఆందోళన సిద్ధమవుతున్న దళిత సంఘాలు
పోలీస్‌స్టేషన్ ఎదురుగా గోడౌన్‌గా మారిన అంబేద్కర్ భవనం

విశాలాంధ్ర-చీపురుపల్లి: రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్కి దక్కిన గౌరవానికి చీపురుపల్లి కేంద్రంలో కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తూట్లు పడుతున్నాయి. లక్షలాది రూపాల వ్యయంతో సుమారు ఏడేళ్ల క్రితం ప్రారంభించిన అంబేద్కర్ సామాజిక భావన నిర్మాణం సగంలోనే నిలిపేయడంతో పాటు తాజాగా సిమెంట్ గొడౌన్ గా కూడా మార్చేశారు. అంబేద్కర్ సామాజిక భవనం దుస్థితి పైన, సగంలో నిలిచిపోయిన నిర్మాణం పై, పక్కతోవ పట్టిన నిధులపైన దళిత సంఘాలు నిలదీస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నీళ్లునమలడం విచిత్రంగా ఉందంటూ దళిత సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. చీపురుపల్లి పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయం ఎదురుగా జిల్లా పరిషత్ నిధుల నుండి లక్షలాది రూపాయల వ్యయంతో సుమారు ఏడేళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన అంబేద్కర్ సామాజిక భవనం ప్రస్తుతం సిమెంట్ గోడౌన్ గా మారడం పట్ల పలు దళిత సంఘాల నేతలు ఆందోళన సిద్ధమవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సామాజిక కార్యక్రమాలకు ఉపయోగ పడవలసిన భవనం గుత్తేదారులకు గోడౌన్ గా మారిందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. భవన నిర్మాణం ప్రారంభం నుండి అవినీతిపరులకు అక్షయపాత్రగా మారిన ఈ భవనం పైన పాలకులు గానీ అధికారులు కానీ పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడం శోచనీయం అంటూ పలువురారోపిస్తున్నారు. చీపురుపల్లి పట్టణంలోని హరిజనవీధి,రెల్లి వీధి, సమీపంలో నిర్మాణం జరిగిన అంబేద్కర్ భవనం ఆయా సామాజిక కార్యక్రమాలకు నిర్వహించాలని లక్ష్యంతో నిర్మాణం జరిపినప్పటికీ లక్ష్యం పూర్తికాకముందే సిమెంట్ గోడౌన్ గా కూడా మారడం పట్ల పలువురు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈ సామాజిక భావన నిర్మాణపు నిధులను పక్కతోవ పట్టించడమే కాకుండా, సగం నిర్మాణం జరిపిన భవనంలో సిమెంట్ గోడౌన్‌గా మార్చడం పట్ల సంబంధిత అధికారులు పాలకులు నిర్లక్ష్యాన్ని పలువురు దువ్వబడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు దృష్టిసారించిసామాజిక భవన నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు వాడుకులోకి తీసుకురావాలని దళిత సంఘాల నేతలు కోరుతున్నారు. సామాజిక భవన నిర్మాణ పనులు సఘంలో నిలిపియడంతోపాటు సిమెంటు గోడౌన్ గా మార్చిన వైనం పట్ల వివరణ కోరుటకు సంబంధిత డి ఈ ని సంప్రదించగా ఆయన అందుబాటులో లేరు.

గంజాయితో పట్టుబడ్డ ముగ్గురు యువకులు

వారి నుండి 200 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర -డెంకాడ : విజయనగరం జిల్లా డెంకాడ మండలం నాతవలస టోల్ గేటు సమీపంలోని చెరువు గట్టు వద్ద గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను డెంకాడ పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుండి 200 గ్రాముల గంజాయి, మూడు మొబైల్ ఫోనులను సీజ్ చేసినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తెలియజేశారు అక్టోబరు 11న నాతవలస టోల్ గేటు సమీపంలోని చెరువు గట్టు వద్ద కొంతమంది వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లుగా డెంకాడ పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో డెంకాడ ఎస్ఐ సన్యాసి నాయుడు, సిబ్బంది మరియు మధ్యవర్తులతో రైడ్ చేసి, చెరువు గట్టు మీద అనుమానస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, విచారణ చేపట్టారన్నారు. అరెస్టుకాబడిన ముగ్గురు నిందితులు విశాఖపట్నం సిటీకి చెందిన (ఎ-1) గంటాచిరంజీవి (20సం.లు) (ఎ-2) గోరిజిలి డానియల్ రాజ్ (24సం.లు) (ఎ-3) చిన్ని సుమంత్ (23సం.లు)వారన్నారు. అరెస్టుకాబడిన నిందితుల వద్ద నుండి 200 గ్రాముల గంజాయి, మూడు మొబైల్ ఫోనులు, ఒక అగ్గి పెట్టెను స్వాధీనం చేసుకున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నిందితులు మద్యం, గంజాయి సేవించుటకు అలవాటు పడి, గంజాయి సేవించేందుకుగాను విశాఖపట్నం నుండి చింతపల్లి బీచ్ కు వెళ్ళే క్రమంలో నాతవలస టోల్ గేటు కు సమీపంలోని చెరువు గట్టుపై గంజాయి సేవిస్తూ, పట్టుబడ్డారన్నారు. ఈ కేసులో నిందితులకు గంజాయిని సప్లై చేసిన వారి గురించి సమాచారం రాబట్టామని, అతడిని కూడా త్వరలో అరెస్టుచేస్తామన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన భోగాపురం సర్కిల్ ఇన్స్పెక్టరు జి. రామకృష్ణ, డెంకాడ ఎస్ఐసన్యాసి నాయుడు మరియు ఇతర పోలీసు సిబ్బందినిజిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.

నేడే నవదుర్గ అమ్మవారి నిజరూప దర్శనం

ఫైల్‌ఫోటో

విశాలాంధ్ర-రాజాం: రాజాం బస్సు స్టాండ్ ఆవరణలో ఉన్నా శ్రీ నవదుర్గ అమ్మవారి 35 వ వార్షికోత్సవ దసరా నవరాత్రి మహోత్సవములు ఘనంగా నిర్వహించడం జరిగాయి. ఆలయ పురోహితులు రామాయణం శ్రీనివాస శర్మ ఈ తొమ్మిది రోజులు అమ్మవారిని తొమ్మిది రోజులు, తొమ్మిది రూపాలుగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదములు అందించారు. ఉత్సవాల ప్రత్యేక అధికారి పొన్నాడ శ్యామలరావు తెలిపారు. నవరాత్రులు ఆలయం ప్రాంగణంలో విద్యుత్ దీపాల కాంతుల అలంకరణతో అమ్మవారి ఆలయం చూపరాలు మంత్రిముగ్ధులై భక్తి పరవసంతో తన్మయ చెందారు. నవరాత్రులు సందర్భంగా అమ్మవారు రోజుకొక రూపంలో భక్తులకు దర్శనం ఇస్తూ భవాని దీక్షలు చేస్తున్న స్వాములు అమ్మవారి రూపాన్ని దర్శనం చేసికొని తమ కోర్కెలు తీర్చే తల్లిగా అమ్మవారిని వేడుకున్నారు. నవరాత్రులు పురస్కరించుకొని ఆలయం దగ్గర తొమ్మిది రోజులు ప్రత్యక కార్యక్రమాలు బొబ్బిలి యుద్ధం బుర్ర కథ, రేలా రే రేలా జానపద నృత్యరూపకం ఇలా తొమ్మిది రోజులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నేడు జరగబోవు దసరా పండుగకి ఆలయ ప్రాంగణంలో భక్తులకు భవానీ మాలాదారులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో శ్యామలరావు, ఆలయ ప్రధాన అర్చకులు రామాయణం శ్రీనివాస శర్మ, అనువంశిక ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, కూరాడ వెంకటరావు కమిటీ సభ్యులు అందరూ కలిసి ఏర్పాట్లు చేశారు.

ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు

అందరూ తరలివచ్చి ఆనందించండి
రెండు రోజులూ మెగా మ్యూజికల్ నైట్‌లు
హాట్ ఎయిర్ బెలూన్ అదనపు ఆకర్షణ : మంత్రి కొండపల్లి
కలెక్టర్‌తో కలసి ఉత్సవ వేదికల పరిశీలన

విశాలాంధ్ర-విజయనగరం :జిల్లా కేంద్రంలో రెండురోజుల పాటు అక్టోబరు 13, 14 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విజయనగరం ఉత్సవాల కోసం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ నేతృత్వంలో జిల్లా అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. ఉత్సవాలకు కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి వుండటంతో యుద్ధప్రాతిపదికన ఆయా వేదికల వద్ద ఏర్పాట్లకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తదితరులతో కలసి శుక్రవారం పలు వేదికలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా వేదికల వద్ద చేస్తున్న ఏర్పాట్లపై ఇన్‌చార్జి అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ముందుగా ప్రధాన వేదిక అయిన అయోధ్య మైదానానికి చేరుకుని అక్కడ ఏర్పాట్లపై నిర్వాహకులతో మాట్లాడి తెలుసుకున్నారు. రెండు రోజులపాటు ఉత్సవ ప్రారంభ ముగింపు కార్యక్రమాలకు రాష్ట్ర స్థాయి ప్రముఖులు, మంత్రులు తదితరులు హాజరు కానున్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యమైన సంగీత, వినోద కార్యక్రమాలు ఇదే వేదికపై జరుగుతున్నందున పెద్ద ఎత్తున ప్రజలు హాజరవుతారని, 13న ఉదయం జరిగే ఉత్సవ ప్రారంభ సభకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, 14న సాయంత్రం జరిగే ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర హెూం మంత్రి అనిత ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని, హెూంమంత్రితో పాటు పలువురు రాష్ట్రమంత్రులు ఆరోజు హాజరు కానున్నట్టు చెప్పారు. అయోధ్య మైదానం వద్ద వచ్చే ప్రజలకు అల్పాహారం, తినుబండారాలు అందుబాటులో వుంచేందుకు పలు స్టాళ్లను అనుమతిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు. మైదానం చివరన వుండేవారికి కూడా కనిపించేందుకు వీలుగా ఎల్.ఇ.డి. స్క్రీన్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డా.అంబేద్కర్ తదితరులు కోట ప్రాంతంలో పర్యటించి అక్కడ జరుగుతున్న కోట సుందరీకరణ పనులను పరిశీలించారు. కోట వెనుకభాగంలో ఏర్పాటు చేస్తున్న లాన్ ను పరిశీలించి అక్కడ వున్న వారితో మంత్రి మాట్లాడారు. కోట దక్షిణ భాగంలో లేజర్ షో నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను మంత్రి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్‌లు పరిశీలించారు. శనివారం నాటికల్లా లేజర్ షో వద్ద అన్ని ఏర్పాట్లూ పూర్తికావాలని అక్కడ పనులు నిర్వహిస్తున్న వారిని ఆదేశించారు.

రాజీవ్ క్రీడా ప్రాంగణంలో హాట్ ఎయిర్ బెలూన్ షో

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని ఆనందించాలని చెప్పారు. ముఖ్యంగా ఈ ఏడాది హాట్ ఎయిర్ బెలూన్, పారామోటారింగ్ తదితర సాహస ఈవెంట్లు యువత కోసం ఏర్పాటు చేశామన్నారు.హాట్ ఎయిర్ బెలూన్ కు టిక్కెట్ ధరను రూ.3వేనుంచి రూ. 2వేల కు తగ్గించడం జరిగిందని, పిల్లలకు రూ. 1500 మాత్రమే వసూలు చేయనున్నట్టు పేర్కొన్నారు. 12వ తేదీ ఉదయం నుంచే హాట్ ఎయిర్ బెలూన్ షో ప్రారంభమవుతుందని, అందరూ యీ సాహస క్రీడలో పాల్గొని ఇక్కడ లభిస్తున్న యీ అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా పోర్ట్ సిటీ స్కూలు వెనుకభాగంలో పారామోటారింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకుడు సుధాకర్ తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు రూ. 3000 టిక్కెట్ ధరగా నిర్ణయించినట్టు చెప్పారు. ఒక రైడ్‌లో ఒకరినే తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. వెయ్యి అడుగుల ఎత్తు వరకు తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు.. ఈ పర్యటనలో సి.పి.ఓ. పి.బాలాజీ, పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, రోడ్లు భవనాలశాఖ ఇ.ఇ. జేమ్స్, డి.ఇ. శ్రీనివాస్, జిల్లాపరిషత్ సి.ఇ.ఓ. సత్యనారాయణ, ఉత్సవ కమిటీ జీవితకాల సభ్యులు ఐ.వి.పి.రాజు, బొద్దల నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారం షాపు చోరీ, ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర-బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో ఇటీవల జరిగిన బంగారం షాపు చోరీకి సంబంధించిన నిందితులను పోలీసులు పట్టుకున్నారు నెల్లివాడ గరుడ బిల్లి గ్రామాల మధ్య జంక్షన్లో జాతీయ రహదారిపై చోరీకి సంబంధించి అజయ్ సుల్తాన్ మోగియా లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1/2 కేజీ వెండి వస్తువులతో పాటు దొంగతనానికి ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు బొబ్బిలి డిఎస్పి శ్రీనివాసరావు శుక్రవారం బొండపల్లి పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో తెలిపారు వీరు శైలత్ సోనీ కురువాయి మధ్యప్రదేశ్ కు చెందిన వారుగా గుర్తించారు ఇంకను ముబ్రాయి లోని వివేక్ పార్టీ శైలేంద్ర స్వామి కుషియా మధ్యప్రదేశ్ చెందిన వారిని అరెస్టు చేయవలసి ఉందన్నారు ఈ కేసు సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఇమ్రాన్ ఖాన్ రవిశంకర్ కానిస్టేబుల్స్ సహకరించారు ఇంతకుముందు విజయనగరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ రూరల్ స్టేషన్ లో కూడా కేసులు ఉన్నాయన్నారు ఈ సమావేశంలో బొండపల్లి ఎస్సై యు మహేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

అక్రమంగా పశువులు తరలిస్తున్న వాహనాలు పట్టివేత

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల పట్టణ పరిధిలో అక్రమం గా పశువులు తరలిస్తున్న రెండు వాహనాలను స్థానిక పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. రాజాం నుంచి నెల్లిమర్ల మీదుగా విజయనగరం వైపు వెళ్తున్న వాహనాలను శుక్రవారం వేకువజామున ఎస్సై గణేష్, సిబ్బంది పట్టుకుని, సీజ్ చేశారు. వాహనాల్లోని పశువులను గుర్ల గోశాలకు అప్పగించారు. వాహన చోదకులపై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

మద్యం దుకాణాలకు వెల్లువెత్తిన దరఖాస్తులు

విశాలాంధ్ర-నెల్లిమర్ల : నెల్లిమర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధి లోని మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. దరఖాస్తుకు గడువు ముగిసే సమయానికి నెల్లిమర్ల నగర పంచాయతీ, నెల్లిమర్ల, గుర్ల మండలాల్లో ప్రభుత్వం నోటిఫై చేసిన 10 షాపులకు మొత్తం 396 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ఎం వెంకటరావు తెలిపారు. ఈ నెల 14వ తేదీన విజయనగరంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న సుజాత కన్వెన్షన్ హాల్లో లాటరీ ప్రక్రియ ఉంటుందని సీఐ పేర్కొన్నారు. దరఖాస్తు దారులు ఆ రోజు ఉదయం 8 గంటలకు హాజరు కావాలని సూచించారు.

నెల్లిమర్ల పోలీసులకు ఎమ్మెల్యే ప్రశంసలు

విశాలాంధ్ర-నెల్లిమర్ల : నెల్లిమర్ల పోలీసు అధికారులను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్లలో గంజాయి విక్రయిస్తున్న 8 మంది నిందితులను సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై గణేశ్, సిబ్బంది తాజాగా పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసుల కృషిని ఎమ్మెల్యే మెచ్చుకున్నారు. నియోజకవర్గములో గంజాయి నిర్మూలనకు పోలీసులు చేస్తున్న కృషిని అభినందించారు. గంజాయి నిర్మూలన, బహిరంగ మద్యపానం నియంత్రణ, సైబర్ నేరాలపై చేపడుతున్న అవగాహనా కార్యక్రమాలపై వారి అభినందనీయమని కొనియాడారు.